

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండలం గుండ్ల కట్ట మంచి గ్రామ పంచాయతీ పూర్వపు పంచాయతీ కార్యదర్శి, జెజి ఉమాపతిని సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బంగారుపాళ్యం మండలం గుండ్ల కట్ట మంచి గ్రామ పంచాయతీ పూర్వపు పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం బంగారుపాలెం మండలం సంక్రాంతిపల్లి గ్రామ పంచాయతీ, వారు గ్రామ పంచాయతీ నిధులు రూ.3,68,441లు దుర్వినియోగం కావడంతో వారిని ఉద్యోగ బాధ్యతల నుండి తాత్కాలికంగా తొలగిస్తూ (సస్పెన్షన్) ఉత్తర్వులతో పాటూ చెక్ పవర్‌ను రద్దుచేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు మొత్తం రూ.3,68,441లు వారి నుండి రెవెన్యూ రికవరీ చట్టం మేరకు రికవరీ చేయాలని బంగారుపాలెం తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు.

పోలీస్‌శాఖకు ఉత్తమ సేవా పురస్కారం





ఉత్తమ సేవా ఉగాది పురస్కారాలు అందుకున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రతిష్ఠాత్మకమైన సేవా పతకాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవా పురస్కారాలు ప్రకటించింది. పతకాల విభాగంలో చిత్తూరు క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎంకె మునిరత్నం గౌరవప్రదమైన ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. చిత్తూరు జిల్లా నుండి ఏఆర్ డిఎస్పీ మహబూబ్ బాష, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మనోహర్‌తో పాటు ఏడుగురు పోలీసు సిబ్బందికి సేవా పతకాలు ప్రకటించారు. దేవరాజులు నాయుడు, వెంకటేశ్వర్లు, సురేష్ కుమార్, నీమతుల్ల, బాలాజీ, హరిబాబు, మనిగండన్‌లు ఉగాది రోజున సేవా పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎస్పి మణికంఠ చందోలు సేవా పతకాన్ని అందు కొనున్న పోలీసు సిబ్బందిని అభినం దించారు. జిల్లాలో శాంతి భద్రతల పరి రక్షణ, ప్రజా సేవలో వారి కృషి ప్రశం సించారు. ప్రజల భద్రత కోసం నిరంత రం శ్రమిస్తున్న ఈ అధికారులను గుర్తించడం గర్వకారణమని పేర్కొన్నారు. పోలీసు సేవలను మరింత ప్రభావ వంతంగా కొనసాగించాలని సూచించారు.

అధికారులు పర్యవేక్షించాలి

రక్షిత మంచినీటి సరఫరా ఏర్పాట్లపై కలెక్టర్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రానున్న వేసవి కాలం దృష్ట్యా రక్షిత మంచి నీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, ఈ ప్రక్రియను మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షిం చాలన్నారు. దీంతో పాటు బహిరంగ మల మూత్ర విసర్జన లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సమన్వయంతో పంచాయతీ సెక్రెటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సాయంతో ఓవర్ హెడ్ ట్యాంక్ లను పరిశుభ్రంగా ఉంచాలని, బహిరంగ మల మూత్ర విసర్జన పై అవగాహన కల్పించా లన్నారు. మార్చి ఆఖరు లోపు ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, ఈ కార్యక్రమం రానున్న మూడు నెలలు పాటు క్రమం తప్పకుండా కొనసాగించాలని, పరిశుభ్రం చేసిన అనంతరం జియో ట్యాగింగ్‌తో ఫొటోలు సమర్పించా లన్నారు. తాగునీటి సరఫరా అయ్యే పైపులు మరమ్మతులకు గురి అయితే మురుగు నీరు కలుషితమై వ్యాధులు వ్యాపించే ప్రమాదం వుందని వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జిల్లాలో గత 15 రోజుల వ్యవధిలో 308 చేతి పంపులు మరమ్మతులకు గురైనట్లు గుర్తించగా 233 చేతి పంపులను సరిచేశామని, 190 పైప్ లైన్ లీకేజీలను గుర్తించి మొత్తం అన్ని పైప్‌లకు మరమ్మతులు చేపట్టామని, 225 పంపు సెట్ లు మరమ్మ తులను గుర్తించి 221 పంపు సెట్‌లను బాగా చేశామని తెలిపారు. ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా నాలుగు, టై అప్ ద్వారా మూడు హ్యాబిటేషన్ లకు నీటి సరఫరా చేపట్టామన్నారు. ఈ సమావేశానికి జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డిపిఓ సుధాకర్ రావ్, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు, ఇతర సంబంధిత అధికారు లు హాజరయ్యారు.

డౌన్స్ సిండ్రోమ్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాల మేరకు ఆర్ బి ఎస్ కె కోఆర్డినేటర్ డాక్టర్ గిరి "ప్రపంచ డౌన్ సిండ్రోమ్(పెదవుల చీలిక) దినోత్సవంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం మార్చి 21వ తేదీ డౌన్స్ సిండ్రోమ్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సంవత్సరం థీమ్ స్టీరియో టైప్ లను అంతం చేయడం , అపోహలు వివక్షత ఫలితంగా డౌన్ సిండ్రోమ్ ఉన్న వ్యక్తులు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ప్రజలకు అవగాహన పెంచడం ఈ థీమ్ ఉద్దేశం అన్నారు. అవహేళనలను, వివక్షను విడనాడి డౌన్ సిండ్రోమ్ ఉన్నవారికందరికీ మద్దతు తెలిపి, వారికున్న అవకాశాలను చికిత్సను విపులంగా వివరించడంతో డౌన్ సిండ్రోమ్ ఉన్నవారు కూడా ఎంతో ఉత్సాహంగా, గౌరవంగా మెలుగుతారని తెలిపారు. ప్రత్యేకంగా వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఈఐసి సిబ్బంది ,హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్య

డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు సుధారాణి హెచ్చరించారు. పిసిపిఎన్‌డిటి చట్టం అమల పై డిఆర్‌ఓ మోహన్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం ఇంటర్ స్టేట్ కోఆర్డినేటర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెల్లూరు, తిరువళ్లూరు , క్రిష్ణగిరి, తిరుపత్తూరు , కోలార్, కుప్పం , నగరి, గుడిపాల ఇంటర్ స్టేట్ సరిహద్దులలోని వైద్యాధికారులు పాల్గొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డిటి సుధారాణి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు 944 మంది ఆడ శిశువులు ఉన్నారని తలిపారు. జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు న్యాయ, పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. చిత్తూరు జిల్లాలో పిసిపిఎన్‌టిడి చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని, ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలని ఆదేశించారు. నిత్యం గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుతున్న వారిపై వైద్య, ఆరోగ్య శాఖ, పోలీసు, విజిలెన్స్ శాఖ నిఘా వుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిపిఎన్ డిటి నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ చంద్రమ్మ, ఐసిడిఎస్ పీడీ వేంకటేశ్వరీ, బోర్డర్ పిహెచ్‌సి డాక్టర్లు , ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగాలు తాత్కాలిక నిలుపుదల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రాంతీయ సంచాలకులు వైద్య ఆరోగ్యశాఖ కడప జోన్ -4 వారి పరిధిలోని కాంట్రాక్ట్ ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగానికి సంబంధించిన నియామకపు నెంబర్ 02/2025 ప్రక్రియ హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు జారీ కావడంతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు డిఎంఅండ్‌హెచ్‌ఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత మాత్రమే నియామక ప్రక్రియ చేపడుతామని తలిపారు. అధికారికంగా తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత మాత్రమే పరిస్థితిని సమీక్షించి తర్వాత నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్ట్ ఫార్మసి ఆఫీసర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గుర్తించాలని సూచించారు. హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి అధికారికంగా సమాచారం కోసం వేచి ఉండాలని కోరారు. ఏదైనా అదనపు మార్గదర్శకాలు లేదా తాజా సమాచారం అందిన వెంటనే అధికారికంగా తెలుపుతామన్నారు.

ఫ్రైడే డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: అర్బన్ హెల్త్ సెంటర్ మాపాక్షి లో ఫ్రైడే డ్రైడే సందర్భంగా జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తనిఖీ చేసి ఫ్రైడే డ్రైడే గురించి ఆశా కార్యకర్తలకు వివరించారు. ఫ్రైడే డ్రైడే సక్రమంగా చేస్తే డెంగీ, చికున్ గున్యా, మలేరియా , బోదకాలు, ఇతర జబ్బులు అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం లో వేణుగోపాల్ రామకృష్ణ, సూపరువైజర్ నారాయణ పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రైడేను తనిఖీ చేస్తున్న మలేరియా అధికారి వేణుగోపాల్

క్యాబేజీ పంట ధ్వంసం

పోలీసులకు బాధితుడి ఫిర్యాదు..!

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద కౌలు రైతు సురేష్ రెడ్డి సాగు చేస్తున్న క్యాబేజీ పంటను గురువారం రాత్రి కొందరు వ్యక్తులు యంత్రాల ద్వారా ధ్వంసం చేశారు. శుక్రవారం బాధితు డు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా గత ఐదు సంవత్సరాలుగా మండలం లోని అడవి పాము బోయినపల్లి ఎం ఆనంద రెడ్డికి చెందిన సర్వే నెంబర్ 83/3లో 60 సెంట్లు, 80/2లో 60 సెంట్లు భూమిలో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చెందిన సనవుల్లా అతని కుమారులు ఇబ్రహీం, కుద్దుస్, అబ్దుల్, రెహమాన్, హర్షద్, ముదనపల్లి గ్రామానికి చెందిన పెత్తందారుల ఖాదర్ బాషా, ప్రఖిల్ బాష, సల్మాన్ జెసిబి ,రెండు రోటివేటర్ ట్రాక్టర్లు తీసుకొచ్చి సురేష్ రెడ్డి అతని భార్య యశోదమ్మపై 'ఈ భూమి మాకు చెందుతుంది' అంటూ దౌర్జన్యం చేసి 'మీరు ఇక్కడి నుంచి వెళ్లకపోతే చంపుతాం..' అని బెదిరించి నానా దుర్భాషలాడారన్నారు. దీంతో వారు భయభ్రాంతులకు గురై అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం అక్కడ పొలానికి ఉన్న ఫెన్సింగ్ , వ్యవసాయ పైపులు, క్యాబేజీ పంటను ధ్వంసం చేసి వెళ్లారు. దీంతో బాధితులకు సుమారు రెండు లక్షల రూపాయలు వరకు ఆస్తి నష్టం కలిగిందని పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.



దౌర్జన్యంతో ధ్వంసమైన క్యాబేజీ పంట

న్యాయవాదుల హౌసింగ్ కాలనీకి కృషి

బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చంద్రప్ప, ఉదయ్‌కుమార్




ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని న్యాయవాదుల హౌసింగ్ కాలనీకి కృషి చేస్తామని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి ఉదయ్ కుమార్ లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని న్యాయస్థానంలో న్యాయ వాదుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు న్యాయవాదులు తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా చంద్రప్ప, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి ఉదయ కుమార్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా అమర్నాథ్, కోశాధికారిగా మురుగన్, సంయుక్త కోశాధికారిగా సుధాకర్, మహిళా కార్యదర్శిగా శైలశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా అనిల్ కుమార్, లైబ్రేరియన్ గా పుష్పలత తదితరులను ఎన్నుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత న్యాయస్థానం భవనం శిథిలావస్థకు చేరడంతో, నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ పనులను పర్యవేక్షించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ అధ్యక్షులుగా బి ఆర్. అమర్నాథ్, ఉపాధ్యక్షులుగా వియస్ శ్రీకాంత్ తదితరులను న్నుకున్నారు.

రాజకీయ ఒత్తిడి మానుకోవాలి

- అంగన్‌వాడీని వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి
- యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే కారణంతో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారులు శాంతిపురం ప్రాజెక్టు కొలమడుగు అంగన్‌వాడీ వర్కర్ స్వాతికి ఉద్దేశ పూర్వకంగా మెమోలిస్తూ బెదిరిస్తూ మానసికంగా ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐ టియు)జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం చేయక పోవడంతో 42 రోజులు పాటు చారిత్మకమైన సమ్మె చేసిన సందర్భంగా శాంతిపురం అంగన్‌వాడీ శిబిరం వద్దకి స్వయంగా ప్రస్తుత అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా వున్న చంద్రబాబు వచ్చి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందుకు విరుద్ధంగా రాజకీయాలతో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అంగన్‌వాడీ వర్కర్లను వేధించే పని శాంతిపురం ప్రాజెక్టులో ప్రారంభమైందని, ప్రభుత్వాలు మారినా అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వ పనులన్నీ రాజకీయాలకు కతీతంగా చేస్తారని తెలిపారు. వీటిని ఆలోచించకుండా ఉద్దేశపూర్వకంగానే కొలమడుగు స్వాతిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. మూడో మెమో ఇచ్చి తొలగిస్తామని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. 'ఆ కార్యకర్త తానేమీ తప్పు చేయలేదని ఎందుకు తొలగిస్తారని ప్రశ్నిస్తే,' 'నీవల్ల ఏమైతే అది చేసుకోండి..' అని బెదిరించడంతో ఆ వర్కర్ మానసికంగా వేదనకు గురవుతోందని యూనియన్ నాయకుల ముందు బోరున విలపించిందన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక పలు చోట్ల ఆత్మహత్యకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. శాంతిపురంలోనూ జరగరానిది జరిగితే దానికి అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆఫీస్ కి రమ్మని చెప్పి ప్రాజెక్టు అధికారులు ఆఫీసులో లేకుండా ఆ సెంటర్‌కి విజిట్ చేయడం చూస్తే ఉద్దేశం పూర్వకంగానే ఆమెను తొలగించాలని ప్రయత్నం అధికారులు చేస్తున్నారని అర్థమవుతోందని ఇప్పటికైనా ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే, కుప్పం ఇన్‌ఛార్జి, శాసనమండలి సభ్యులు అయిన వారు ఇలాంటి ఘటనలపై స్పందించి అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరారు.

5న తిరుపతిలో పోరుబాట సదస్సు

- పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలి..
- ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు రూ.25 వేల కోట్లు విడుదల చేయాలి
- యుటిఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఏప్రిల్ 5వ తేది తిరుపతి లో ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యా సదస్సు, పోరుబాట సదస్సు జరుగుతుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక యుటిఎఫ్ హోంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ పోరుబాటలో భాగంగా తిరుపతి కేంద్రంలో ఐదు జిల్లాల విద్యా సదస్సు జరుగుతుందని, దీనికి రాష్ట్ర యుటిఎఫ్ నాయకత్వం హాజరవుతారని, యుటిఎఫ్ కార్యకర్తలు మండల స్థాయిలో సర్వే నిర్వహించి విద్యార్థుల ఎన్రోల్మెం టుకు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయా లన్నారు. ప్రభుత్వం తొలి సంత కం చేసిన డీఎస్సీని వెంటనే వేయాలని ఆయన పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ 117 జీవో రద్దు, పాఠశాలల విలీనాలపై ప్రభుత్వం స్పందించాలని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయు ల 25 వేల కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరారు. పోరుబాటలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుండి ప్రాంతీయ సదస్సుకి పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం బకాయిలను పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే వేయాలని, మధ్యంతర భృతి (ఐ ఆర్)విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు, ఎస్ మణి గండన్, నాయకులు పి సుధాకర్ రెడ్డి, కె రెడ్డెప్ప నాయుడు, ఎస్ రెహనా బేగం, ఎస్ పి బాషా, కే సరిత, డి ఏకాంబరం, ఎం పార్థసారథి, పంటపల్లి సురేష్, ఈశ్వర్ మహేంద్ర, జగన్ మోహన్ రెడ్డి, సాధన కుమార్, కె మోహన్ రెడ్డి, భాను ప్రకాష్, దేవరాజుల నాయుడు, అరుణ్ కుమార్, రాజేష్ కుమార్, పెద్దబ్బరెడ్డి నాగరాజా, చంద్ర మునికృష్ణయ్య, రాజేంద్ర పార్థసారథి, సర్దార్, ఎం ఎస్ శేఖర్, లీలావతి, చిరంజీవి వడివేలు, మునిరత్నం, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

బెట్టింగ్ చట్టరీత్యా నేరం : డీఎస్పీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : బెట్టింగ్ చట్టరీత్యా నేరమని, బెట్టింగుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కుప్పం డిఎస్‌పి పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ ఐపీఎల్ ప్రారంభం కానున్న సందర్భంగా కుప్పం డివిజనల్ పరిధిలో క్రికెట్ అభిమానులు, ప్రజలు బెట్టింగ్ కు పాల్పడరాదని, బెట్టింగ్ నిర్వహించరాదని సూచించారు. చట్ట వ్యతిరేకంగా ఎవరైనా బెట్టింగ్ నిర్వహించిన, పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆపరేషన్ గరుడ

మెడికల్ షాపుల తనిఖీ

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: ఆపరేషన్ గరుడలో బాగంగా శుక్రవారం చిత్తూరు పట్టణం లో పలు మెడికల్ షాపుల గరుడ టీం తనిఖీ చేసింది. ఈ దాడుల సందర్భంగా, నిషేధిత మందులను డాక్టర్ రసీదు లేకుండా విక్రయిస్తున్న మెడికల్ షాపులను గుర్తించి, సంబంధిత షాప్‌లపై చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్ రద్దు కోసం ప్రతిపాదనను పంపిన రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి కరిముల్లా షరీఫ్ ఆపరేషన్ గరుడలో భాగంగా, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కరిముల్లా షరీఫ్ పర్యవేక్షణలో చిత్తూరు పట్టణంలో డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మెడికల్ షాపులపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులలో భాగంగా మురకంబట్టులోని మెడిలైఫ్ మెడికల్ షాప్, దర్గా , కొంగారెడ్డి పల్లిలోని అపోలో ఫార్మసిలో బిల్స్ లేకుండా , డాక్టర్ల రశీదు లేకుండా అమ్మకూడని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై స్పందిస్తూ, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి సంబంధిత మెడికల్ షాప్‌లపై చర్యలు తీసుకోవడంతో పాటు, వారి లైసెన్స్ రద్దు కోసం ప్రతిపాదనను అధికారులకు పంపించారు. ఈ దాడులలో డ్రగ్ ఇన్స్పెక్టర్ కీర్తన, లాఅండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్, ఎస్ఐ అనిల్ కుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి పాల్గొన్నారు.

ఇకపై బుధవారం ఫిర్యాదుల స్వీకరణ: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఇకపై ప్రతి బుధవారం ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. ఇప్పటి వరకు శనివారం వినతులు స్వీకరించేవారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. మధ్యాహ్నం పైన ఆ పార్టీ కార్యకర్తలు , నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మార్పు గమనించి నియోజకవర్గ ప్రజలు బుధవారం లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం 'ప్రజా దర్బార్'లో వినతి పత్రాలు సమర్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కవులు

కవిత్వం సమాజాన్ని ప్రతిబింబించాలి

ప్రజాశక్తి- గంగవరం: కవిత్వం సమాజాన్ని ప్రతిబింబించాలని ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శుక్రవారం తెలుగు సాహిత్య సాంస్కృతక సమితి ఆధ్వర్యంలో కళామందిరంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సమస్యలను కవులు ఎత్తి చూపాలన్నారు. కవిత్వం ద్వారా భాషను కూడా కాపాడుకోవడానికి కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు సూచించారు. కవులు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, చంద్రశేఖరయ్య, పలమనేరు బాలాజీ, సంస్థ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.

మరో సైబర్ నేరం

కంపెనీ అకౌంట్‌ను సీజ్ చేసిన సైబర్ పోలీసులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అలమారాలు తయారు చేయడానికి ఆన్‌లైన్‌లో రూ. 3లక్షల65వేలు డబ్బులు కట్టి మోసపోయిన చిత్తూరు పట్టణానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు చేసిన సైబర్ ఫిర్యాదు పై తక్షణ స్పందిస్తూ సంబంధిత కంపెనీ అకౌంట్లను సైబర్ పోలీసులు సీజ్ చేశారు. సమాజంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు మీరు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని బాధితుడు చిత్తూరు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. చిత్తూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కాబర్స్ అరిస్టో లిమిటెడ్ కంపెనీ వద్ద అలమారాలకు సంబంధించిన వస్తువుల కోసం 31-10-2024వ తేదీన ఆర్డర్ ఇచ్చి, ఆన్‌లైన్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లించాడు. అయితే, చెల్లింపు చేసినప్పటికీ, కంపెనీ వస్తువులను అందించకుండా మోసం చేసింది. బాధితుడు అనేక మార్లు ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. అప్రమత్తమైన బాధితుడు ఇది సైబర్ మోసం అని గ్రహించి ఈనెల 10తేది న చిత్తూరు సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పై చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ అధికారులు తక్షణమే స్పందించి, పూర్తి లావాదేవీల వివరాలను సమీక్షిస్తూ, తదుపరి చర్యలలో భాగంగా సంబంధిత కంపెనీ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసి సంబంధిత కంపెనీ వారితో మాట్లాడి చర్యలు తీసుకున్న ఫలితంగా ఈనెల 19వ తేదీన బాధితుడు ఆర్డర్ చేసిన ఉత్పత్తిని కంపెనీ వారు అందించారు. దీని పై బాధితుడు తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ నా ఫిర్యాదుకు పోలీస్ డిపార్టుమెంటు వారు తీసుకున్న తక్షణ చర్యకు కృతజ్ఞతలు తెలిపాడు.

గృహ నిర్మాణాలు వేగవంతం

సమీక్ష సమావేశంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం



గృహనిర్మాణ పురోగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరు పేదలకు ప్రతి ఒక్కరికీ స్వంత ఇంటిని నిర్మించి ఇవ్వడంలో భాగంగా ఎస్ సి, ఎస్ టి, బిసిలకు ఇంటి నిర్మాణానికి అందించే అదనపు ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు వివరించి గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి పూర్త య్యేందుకు హౌసింగ్ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లా సచివాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ పనులపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద చేపట్టిన గృహాలలో వివిధ దశలల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణం చేపట్టి పూర్తి అయ్యే దశలో ఉన్న 6,568 గృహాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అసంపూర్ణంగా ఉన్న గృహాల లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వం తరపున ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అందిస్తున్న అదనపు ఆర్థిక సాయాన్ని వివరించాలన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 16,406 మంది లబ్ధిదారులను గుర్తించామని, వీరిలో 6,388 మందికి సంబంధించి రూ.9.20 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, మిగిలిన వారికి పథకం వివరాలను వివరించి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనితో పాటు సిమెంట్, స్టీల్, తదితరాలను అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంపిడిఓలు, గృహ నిర్మాణాలకు సంబంధించి యాక్టివ్ బెనిఫిషరీ లను గుర్తించా లన్నారు. గృహ నిర్మాణాలకు చేసిన ఖర్చు వివరాలను అందించాలన్నారు. గృహాల సమూహం ఉన్న లే అవుట్ లలో అవసరమైన రోడ్ల నిర్మాణాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ అధికారులు, హౌసింగ్ అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపితే వాటిని పరిశీలించి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎస్‌సి అసెంబ్లీ నియోజకవర్గాలైన పూతలపట్టు, గంగాధర నెల్లూరు నియోజక వర్గాలలో లే అవుట్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాల కోసం పిఎంఎవై 2.0 కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో భాగంగా కుప్పం, పలమనేరు, నగరి, పుంగనూరు నియోజక వర్గాలలో 175 పనులు మంజూరు కాగా రూ.47 లక్షలతో 162 పనులు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశా నికి పీడీ హౌసింగ్ గోపాల్ నాయక్, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన


డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -తవణంపల్లి: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా తవణంపల్లిభవిత కేంద్రం లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డౌన్ సిండ్రోమ్ లక్షణాలు వివరించి నివారణ చర్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు టి దేవేంద్ర, ఏం డిలీప్ ప్రత్యేక అవసరాల పిల్లలు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అలవర్చుకోవాలి : సిడిపిఓ

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: సాంకేతికతపై అవగాహన అలవర్చుకోవాలని సిడిపిఓ ఇన్చార్జ్ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని మొగిలివెంకటగిరి ఉన్నత పాఠశాలలో రెండవ రోజు అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ సూపర్‌వైజర్లు జయ శ్రీ, రెడ్డి కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునాతన సమాజంలో సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలని పాఠశాలలో జరిగే విద్యాబోధన హాజరు శాతాన్ని నమోదు చేసేందుకు యాప్‌ల ద్వారా ఉపయోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మొగిలి, చీకురుపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మహాత్మ జ్యోతిరావు పూలే సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు పెంచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఏ జ్యోత్స్న శుక్రవారం పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ శంకర్రాయలపేటలో బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి,6 తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ ప్రవేశాల కోసం ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన బాలికలు విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదో తరగతిలో 40 సీట్లు, ఆరు నుండి తొమ్మిదవ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లుకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదో తరగతికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 27న ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆరు నుంచి తొమ్మిది తరగతుల వారికి 28 ఏప్రిల్ 2025 సోమవారం ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9515764818 సంప్రదించాలని ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు.

అంగన్‌వాడీలకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండవ రోజు శిక్షణ సిడిపిఓ ఇందిరా ప్రియ దర్శిని ఆధ్వర్యంలో సూపరు వైజర్లు శారద, లత శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు నవచేతన, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఆదర్శిల గురించి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చామని, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు సరైన పద్ధతి లో కొలచి వారి పోషణ స్థాయిని గుర్తించి, పోషకాహారలోపంలో వున్న పిల్లల తల్లితండ్రులకు గృహ సంరక్షణ కార్యక్రమంలో సూచనలు, సలహాలు ఇచ్చి పిల్లల పోషణ స్థాయిని మెరుగుపరచడానికి అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించా మని సిడిపిఓ ఇందిరా ప్రియదర్శిని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని 40 అంగన్‌వాడీ సెంటర్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.4.32 లక్షల ఆదాయం



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం లోని తీర్థం పంచాయతీ పరిధిలో ఉన్న కైగల్ దుము కురాలు జలపాతం వద్ద వాహనాల పార్కింగ్ వేలంపాట శుక్రవారం ఈవోఆర్ డి సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఇందులో భాగంగా దుముకురాల జలపాతం పార్కింగ్ స్థలం ద్వారా వేలంపాటలో నాలుగు లక్షల 32 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆర్ డి ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి, సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ , ఎంపిటీసీ తనయుడు కేశవులు టిడిపి సభ్యులు గోవిందస్వామి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిరీక్షణ

బోరు నీళ్లు ఉన్నా వ్యవసాయానికి దూరంగా రైతు

ప్రజాశక్తి -గంగవరం : లక్షల రూపాయలు ఖర్చుచేసి వ్యవసాయ బోర్లు వేసి నీళ్లు పుష్కలంగా ఉన్నా వ్యవసాయం చేయడానికి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. నెలలు తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో విసిగి వేసారి పోతున్నారు.ఈ సందర్భంగా బాధిత రైతు గుర్రప్ప మాట్లాడుతూ కోనపురెడ్డిపల్లి గ్రామంలో తన సొంత భూమిలో బోరు వేసి నీళ్లు పుష్కలంగా ఉన్నాయని ట్రాన్స్‌ఫార్మర్ కోసం సంవత్సరం నుండి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు రోజుల క్రితం కార్యాలయం వద్దకు అధికారుల పిలవడంతో బాడుగ ఆటోను తీసుకొని కార్యాలయం వద్దకు వెళితే అధికారులు అందుబాటులో లేరని కింది స్థాయి అధికారులు 'నువ్వు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇలా అయ్యింది..డబ్బులు ఇస్తే వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తా..' అనడంతో విధిలేని పరిస్థితిలో ఆటోకు వెయ్యి రూపాయలు బాడుగ ఇచ్చి వెను తిరిగానని వాపోయాడు. గంగవరం మండలం విద్యుత్ శాఖ అధికారి బుధవారం రోజు ఆటో తీసుకొని రమ్మని ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తామని చెప్పడంతో మూడు రోజులుగా కార్యాలయం వద్ద పడికాపులు కాస్తున్నానని ఉదయం వెళ్లి అడిగితే 'ఏడీ తో మాట్లాడతా..' అని చెప్తున్నారని, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై సంవత్సరం అవుతున్నా రైతు పొలము బీడు వుంటున్నా ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదని బాధిత రైతు వాపోతున్నాడు. విద్యుత్ ఏడీ తనపై కనికరించి వెంటనే పరిశీలించి తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

ఏదీ పరిష్కారం?

- రోడ్డెక్కిన వారపు సంత
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- గత సమావేశంలో ఎంపీపీ ఆగ్రహం
- వారం అవుతున్నా కన్పించని ప్రత్యామ్నాయం



ప్రజాశక్తి -వెదురుకుప్పం: వారపు సంతలు మళ్లీ రోడ్డెక్కాయి. స్థానికులకు, వాహనదారులకు సమస్యలు తప్పడం లేదు. సమస్యను తెలుసుకున్న ఎంపిపి బండి నాగరాణి గతవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ విషయమై చర్చించారు. వెంటనే దృష్టి సారించి సమస్య పరిష్కారానికి ఇటు ఎంపీడీవో కార్యాలయం , అటో పోలీస్ యంత్రాంగం సమిష్టిగా శాశ్వత పరిష్కారం చూపిస్తారా.. లేదా..?' అని ప్రశ్నించారు. వారం అవుతున్న ఎంపిపి ప్రశ్నకు శాశ్వత పరిష్కారం లభించలేదు. దీంతో స్థానికులు 'ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందా.. లేదా?' అని ఎదురుచూస్తున్నారు.

రోడ్డుపైనే వారపు సంతలు

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలంలో వారంలో ఏదో ఒక చోట ఈ వారపు సంతలు నిర్వహిస్తున్నారు. పచ్చికాపల్లం, వెదురు కుప్పం, మొరవ , దేవళం పేట ప్రధాన వాణిజ్య సముదాయాలు. రైతులు పండించే పంటలను, వ్యాపారులు ఇక్కడికి వచ్చి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటారు. రద్దీ అధికంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో గంటల తరబడి వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. హారన్ మోతతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. పరిస్థితి తీవ్రంగా వుండడంతో వెంటనే పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వారపు సంత ప్రాంతాలు

మండలంలో పచ్చికాపల్లం ఆదివారం, వెదురుకుప్పం మంగళవారం, మొరవ గురువారం, దేవళం పేట శుక్రవారం వారపు సంత నిర్వహిస్తున్నారు. ఒక పచ్చి కాపల్లికి మాత్రం సొంత స్థలం వుంది. మిగిలిన సంతలు రోడ్డుపైనే నిర్వహిస్తారు. దీంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి..


గత సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

ఈ వారపు సంత వల్ల ప్రజలు, ఆర్టీసీ వ్యవస్థ, వాహన దారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటు న్నారు.. ఈ సమస్యను పోలీసు యంత్రాంగం, ఎంపీడీవో కార్యాలయం సమిష్టిగా పరిష్కరించాలి..

- గత సర్వసభ్య సమావేశంలో బండి నాగరాణి , ఎంపీపీ, వెదురుకుప్పం.

సమస్యను పరిష్కరిస్తాం



గతంలో పచ్చికాపల్లం లో రోడ్డుపై సంత నిర్వహణ లేకుండా చేసాం. మళ్లీ ఈ వారపు సంత రోడ్డుపైకి వచ్చిందని తెలిసింది. పోలీస్‌ల సహకారంతో సమస్యను పరిష్కరిస్తాం..

- అమరనాథరడ్డి, ఎంపిడివో, వెదురుకుప్పం.

వెదురుకుప్పం తహశీల్దారుగా బాబు


తహశీల్దారు బాబు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురు కుప్పం మండల తహశీల్దారుగా బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రమేష్ బాబు బదిలీపై పూతల పట్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల తహశీల్దారు కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీదారుడికి న్యాయం చేస్తానని తెలిపారు.

పూతలపట్టు తహశీల్దారు రమేష్ బాబు..


రమేష్ బాబు

పూతలపట్టు: పూతలపట్టు నూతన తహశీల్దారుగా శుక్రవారం రమేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన రమేష్ ఈయన వెదురు కుప్పం మండలంలో పనిచేస్తూ బదిలీపై పూతల పట్టుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం వినతుల దినంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దీర్ఘకాలిక భూ సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రామకుప్పం తహశీల్దారు కాలేష్..


కాలేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రామకుప్పం: రామకుప్పం మండల నూతన తహశీల్దార్ గా శుక్రవారం కాలేష్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన రామకుప్పం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. నూతన తహశీల్దార్ కు డిటి బాలాజీ, ఆర్ ఐ నారాయణ , వి ఆర్ ఓ లు, రెవెన్యూ సిబ్బంది పూల మాలలు వేసి స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దారు కె బాబు వెదురుకుప్పంకు బదిలీ అయ్యారు.

బదిలీ తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు తహశీల్దారుగా పనిచేసి ఇటీవల బదిలీపై చిత్తూరు కలెక్టరేట్ కు వెళ్లిన తహశీల్దారు గుర్రప్పను శుక్రవారం పూతలపట్టు తహశీల్దారు కార్యాలయ రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు తహశీల్దారు రమేష్ కుమార్. డిప్యూటీ తహశీల్దారులు మునికృష్ణ. కవిత, వీఆర్వోలు. వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ సంబరాలు

ప్రజాశక్తి -సోమల: రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఏకగ్రీవ తీర్మానం తెలపడంపై మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు, కూటమి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొని ప్రధాని మోడీ, మంద కృష్ణ మాదిగ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, మంద రామనాథం, సీనియర్ నాయకులు మొగిలి ఈశ్వరయ్య, శుభకర్, ఎర్రబెల్లి రవి, లక్ష్మీపతి ప్రకాష్ మండల అధ్యక్షులు వరగాని ప్రభు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మహిళా, శిశు సంక్షేమ ప్రొటెక్షన్ సభ్యులు షణ్ముగం, ఉష, ఉమాదేవి, మురళి కోరారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముక్కలతూరు ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ , బాల్య వివాహాలను అరికట్టడం అంశాలపై విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ ఎం లోకనాథం, సచివాలయం మహిళా పోలీసు శోభ పాల్గొన్నారు.

చిన్నారులను ఆకట్టుకోవాలి: సిడిపివో

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: అంగన్వాడీ కేంద్రాల చిన్నారులను ఆటపాటలతో ఆకట్టుకుని విద్యాబోధన చేయాలని సిడిపిఓ వినతశ్రీ కోరారు. గంగాధర నెల్లూరు మండలం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎంపిడిఓ మీటింగ్ హాలులో శుక్రవారం అంగన్వాడీలకు రెండోరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లు అనురాధ , నాగరత్నమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు


పూజలు నిర్వహించి బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -వి కోట : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా తక్షణ చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ముదరం దొడ్డి గ్రామ పంచాయతీ నడిపేపల్లిలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జెడ్పీ నిధులతో నూతన బోరు మంజూరు చేసి శుక్రవారం ప్రారంభానికి పూజలు నిర్వహించారు. ఇటీవల స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై తీసుకున్న చర్యలను మండల పరిధిలో సాగుతున్న అభివృద్ధి పనుల వివరాలు ఎంపీడీవో ఈశ్వరన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నడిపేపల్లిలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్తుల చేసిన ఫిర్యాదు మేరకు తక్షణం జెడ్‌పి నిధుల నుండి నూతన బోరు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. ఈ సంవత్సరం తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో మండల పరిధిలో భూగర్భ జలాలు అనుకున్న స్థాయిలో మెరుగుపడలేదని దీని ప్రభావంతో తాగునీటి బోర్లలో నీరు అడుగంటే ప్రమాదం వుందని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలని వారు సూచించారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి సమస్యలు పరిష్కారానికి నిధులు కొరత లేదని అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, ఎంపీటీసీ హరీష్ రెడ్డి, ఆతావుల్లా, వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు రాధాకృష్ణారెడ్డి, ఆనంద్ రెడ్డి, సంపంగి రెడ్డి, మైనారిటీ మత పెద్దలు , ప్రజలు పాల్గొన్నారు.

'సుచి' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



సుచి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - యాదమరి: సుచి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వేలూరు సిఎంసి వైద్య బృందం సాయంతో మెగా ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. జోడి చింతల సుచి సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా సుచి సంస్థ డైరెక్టర్లు గ్లోరీ విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ క్యాంపును ఏర్పాటు చేశామని తెలిపారు సిఎంసి డాక్టర్ కవినిల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపిల్లలు పౌష కాహార లోపంతో అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. సరైన సమయంలో సరైన వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. పేదలకు సేవ చేయడానికే తాను డాక్టరుని అయ్యానని తెలిపారు. 'అందరూ బాగుండాలి.. అందులో నేనుండాలి' అని తెలిపారు. ఈ క్యాంపులో సిఎంసి డాక్టర్ల ఆధ్వర్యంలో రక్త, మూత్ర పరీక్షలు, షుగర్, బిపి, టిబి, గుండె, ఎముకలు, పలు రకాలైన జబ్బులకు చికిత్సలు అందించారు. ఈ మెడికల్ క్యాంపులో పాల్గొన్న 110 మందికి మందులు, మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్య , టిబి ఎలా వస్తుంది? దాని లక్షణాలు, నివారణ మార్గం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఎంసి వైద్య సిబ్బంది క్రిస్ మేరి మోన్స్ , అంజలి బెన్ని, పేర్సెస్ యోహాన్, ప్రీత , ఆలం జోసఫ్, వింజం ధరణి కుమార్, సుచి సంస్థ సిబ్బంది, కన్సల్టెంట్ శ్యామ్సన్, ఆనంద్ కుమార్, ధనలక్ష్మి, వరద రాజులు, జాకప్ , జాన్సన్ ఎంఎస్ మనీ, డి చిన్నయ్య, శశి కుమార్, ప్రజలు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలు

మామిడి రైతులను ఆదుకోండి


- మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయండి
- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, యాదమరి: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. అదే సమయంలో ఇతర దేశాలకు ఎగుమతి చేసే మామిడి పలు సుంకాన్ని తగ్గించి, విదేశాలకు మామిడి గుజ్జును ఎగుమతి చేసే అవకాశాన్ని కల్పించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఆయన శుక్రవారం షీ మేరకు విజ్ఞప్తి చేశారు. మామిడి పంటకు ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి అని 3.7 లక్షల హెక్టార్లలో మామిడి విస్తరించిందన్నారు. కృష్ణా ,చిత్తూరు, గోదావరి జిల్లాలు మామిడి పంటకు ప్రసిద్ధి చెందినవని తెలిపారు. ముఖ్యంగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో తోతాపురి ప్రధాన పంట అని పేర్కొన్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే పల్ప్ ఉక్రెయిన్ దేశానికి ఎగుమతి అయ్యేదనీ అయితే రష్యా - ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా.. పల్ప్ ఎగుమతి ఆగిందన్న విషయాన్ని ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇక యూరోపియన్ దేశాలు ఆఫ్రికన్ దేశాల కంటే పల్ప్ దిగుమతి సుంకాన్ని పెంచడంతో ఇండియా నుంచి మామిడి పల్ప్ ను విదేశాలకు ఎగుమతి చేయడం తలకు మించిన భారంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని చిత్తూరు పార్లమెంటులో ఉత్పత్తి అవుతున్న మామిడిపల్ప్‌ను విదేశాలకు ఎగుమతి చేసే విషయాన్ని చర్చించి మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఎన్డీఏ సర్కార్ గుర్తించి వారికి గిట్టుబాటు ధరను కల్పించి అన్నదాతలకు అండగా నిలవాలని ఆయన కోరారు.

ఆందోళన వద్దు..

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే భరోసా



ప్రజాశక్తి- పలమనేరు: ఆందోళన చెందవద్దని చిరు వ్యాపా రులకు తగిన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి భరోసా ఇచ్చారు. పలమనేరులో చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు శుక్రవారం మధ్యాహ్నం పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డిని అతని కార్యాలయంలో కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. పట్టణ ప్రజల కోరిక మేరకు పట్టణంలోని వారపు సంత ప్రాంగణంలో వీధి వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ అధి. కారులు అక్కడికి తరలించారు. దీంతో స్థానిక శివాలయం, గంగమ్మ గుడి వీధి, సూపర్ బజార్ చుట్టుపక్కల వీధి పై కాయగూరలు వ్యాపారం చేసే వారు శుక్రవారం ఎమ్మెల్యేను కలసి తమ సమస్యను విన్నవించుకున్నారు. అధికారులు ట్రాఫిక్ కు ఇబ్బందులు ఉన్నాయని రైతు బజార్ లోకి పంపడంతో తమకు వ్యాపారాలు జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రైతు బజార్ లోనికి వచ్చి కొనుగోలుదారులు కాయగూరలు, పూలు కొనలేరని దాంతో పాటు వస్తువులను రవాణా చేసే వాహనాలు సైతం లోనికి తీసుకెళ్లే పరిస్థితి లేదని తెలిపారు. గతంలో వలే రోడ్డు పక్కన ట్రాఫిక్ కు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపా రాలు చేసుకుం టామని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై అధికా రులతో మాట్లాడి అటు పట్టణ ప్రజలకు, వ్యాపారు లకు ఇబ్బందులు లేకుండా ఉండేలా అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకుం టామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాపా రులతో పాటు పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇసుక అక్రమ రవాణా

ఐదు ట్రాక్టర్ల సీజ్

ప్రజాశక్తి - గంగవరం: మండలంలో ఇసుకను అక్రమంగా తరలి స్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని దండపల్లి సమీపంలోని కౌండిన్య నదిలో గురువారం రాత్రి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న అధికారి ప్రసాద్ కౌండిన్య వద్దకు చేరుకొని ఐదు ట్రాక్టర్లు, ఒక జెసిబిని సీజ్ చేశామని తెలిపారు. గత కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తు న్నారని సమాచారం అందిందని ఈ వాహనాలకు కొన్నింటికి రికార్డు లు కూడా లేవని, డ్రైవర్లకు లైసెన్స్‌లు కూడా లేవని పేర్కొన్నారు. వెంటనే వీటిని సీజ్ చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 30 మందికి గాయాలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : తమ బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి ప్రాణాపాయం తప్పిన పెను ప్రమాదం జరిగిన ఘటన మండలంలో పోతనపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ఎస్ఆర్ పురం మండలం పొదలపల్లి వద్ద ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో సుమారు 30 మందిపైగా గాయాలు పాలయ్యారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండలంలో బాల గంగనపల్లి గ్రామంలో అంత్యక్రియలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా పొదలపల్లి గ్రామం దగ్గర ఓ మలుపు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు హుటాహుటిన గాయాలైన వారిని మండల కేంద్రమైన ఎస్ ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఏడుగురికి తీవ్ర గాయాలు. 22 మంది గాయాలయ్యాయి. వారందరూ వెదురుకుప్పం మండలం యనమల మంద కాలనీకి చెందినవారు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ ప్రభుత్వ తహశీల్దార్ లోకనాథ పిల్లై , పోలీస్ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర చేరుకుని క్షేత్ర గాత్రులను మెరుగైన వైద్యం కోసం తహశీల్దారు పర్యవేక్షిస్తూ సమాచారాన్ని కలెక్టర్ కు చేరవేసి ఆరు 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఆర్ పురం వైద్యాధికారి హర్షవర్ధన్, వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి వైద్యం అందించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ చొరవతో అధికారులను అప్రమత్తం చేసి సకాలంలో చేరుకుని క్షేత్రగాతులకు 108 సేవలను అందించారు. సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్, వైద్య సిబ్బంది, 108 సేవలు, ప్రభుత్వ అధికారుల సేవలను క్షేత్రగాతుల బంధువులు గ్రామస్తులు, అభినందించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గం పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈనెల 16వ తేదీ గుడుపల్లి మండలం శెట్టిపల్లి గ్రామ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో రాత్రిపూట దొంగతనం జరిగిన సంగతి తెలిసిందే. ఈ దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు దొంగ సొమ్మును శాంతిపురం మండల పరిధిలో విక్రయించడానికి వెళుతుండగా మార్గమధ్యంలో గుడుపల్లి ఎస్సై శ్రీనివాసులు వారిని గుర్తించి అదుపులోనికి తీసుకున్నట్టు తెలిపారు. నిందితుల కుప్పం పట్టణానికి చెందిన గోపాల్, ఇబ్రహీం అనే ఇబ్బులుగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అయితే గత సంవత్సరం రామకుప్పం మండలం చెల్లిగానిపల్లి గ్రామంలోని ఒక సూపర్ బజార్ నందు జరిగిన నిత్యవసర సరుకుల దొంగతనం కేసులో సైతం వీరిని నిందితులుగా గుర్తించినట్టు తెలిపారు. నిందితులను కుప్పం న్యాయస్థానం నందు హాజరు పరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్టు తెలిపారు.

దుష్ప్రచారం తగదు: ఏడీ చిన్నబ్బ

ప్రజాశక్తి- పలమనేరు: రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వినియోగదారులను విద్యుత్ అధికారులు తిప్పిస్తున్నారని ఆరోపణలు చేయడం తమ దృష్టికి వచ్చిందని ఈ దుష్ప్రచారం మానుకోవాలని విద్యుత్ శాఖ ఈ చిన్నబ్బ పేర్కొన్నారు. ఈ దుష్ప్రచారంపై వెంటనే స్పందించిన ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ మెటీరియల్ ఇస్తామని ముఖ్యంగా విద్యుత్ వినియోగదారులు గమనించాల్సిన విషయం ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా అధికారులను క్షేత్రస్థాయిలో కలిసి సమస్యను పరిష్కరించుకోవాలి తప్ప సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం తగదన్నారు. నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా కొంతమంది దళారులను నమ్మి ఇబ్బందులు పాలవుతున్నారని, మీ సమస్యలు ఉంటే నేరుగా అధికారులను కలిసి పరిష్కరించుకోవాలని కోరుతున్నామన్నారు.

151.98 కిలోమీటర్ల సిసి రోడ్లు పూర్తి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): జిల్లా లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 207.5 8 కిలోమీటర్లు సిసి రోడ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 151.98 కిలోమీటర్ల సిసి రోడ్లు పూర్తి చేశామని, ఫారం ఫాన్స్ లక్ష్యం 12,984 కాగా 17,009 మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 2938 గ్రౌండింగ్ చేయగా 1283 పూర్తి చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జల సంరక్షణలో భాగంగా ఉపాధి హామీ కింద పెద్ద ఎత్తున పంట నీటి కుంటల నిర్మాణం చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పల్లె పండుగ, ఫారం ఫాండ్స్ నిర్మాణం, ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు చిత్తూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డ్వామా పీడీ రవికుమార్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి: డీపీఓ



ప్రజాశక్తి -ఐరాల: గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని డిపివో సుధాకర్‌రావు పేర్కొన్నారు. డిపివో ఐరాల మండలం లోని 35 ఎర్లంపల్లి, ఐరాల, పాతపల్యం , నాగవాండ్లపల్లి పంచాయతీ లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి అన్ని గ్రామాలు , రోడ్డు పక్క పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని , అన్ని చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగం లోకి తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విస్తారణాధికారి కుసుమ కుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమమే ధ్యేయం'

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రత్యేక ప్రతిభావంతుల (వికలాంగులు) ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ప్రత్యేక శిబిరాన్ని కడా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు హాజరయ్యారు. ముఖ్య అతిథులతో కలిసి కడా పీడి వికాస్ మరమ్మత్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక ప్రతిభా వంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆయన సొంత నియోజకవర్గంలో రెండు రోజులపాటు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో తొలి రోజు అయిన శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని గుడుపల్లి, శాంతిపురం, రామ కుప్పం మండలాలకు చెందిన వారు 2267 మంది హాజరు కాగా అందులో 1407 మంది సదరం సర్టిఫికెట్ నమోదు చేయించుకున్నట్టు తెలిపారు. రెండవ రోజు శనివారం జరగబోవు శిబిరాన్ని కుప్పం పట్టణం, మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, మూడు మండలాలకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం పరిసర ప్రాంతాలలోని విద్యార్థుల సౌకర్యార్థం ఐఐటి, నీట్, ఎంసెట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎస్.వి గ్రూప్స్ అధినేత బి.ఎం దయానిధి తెలిపారు. ఐ.ఆర్.ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన పూజ కార్యక్రమంతో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసుకుని ఇంజనీరింగ్, వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 45 రోజుల ఐఐటి, నీట్, ఎంసెట్ శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు అనుభవ జ్ఞులైన అధ్యాపకులతో ఉత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కుప్పం పరిసర ప్రాంతాలలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఆర్.ఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కుప్పం ప్రిన్సిపల్ డాక్టర్ అరుల్ రాజ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.